# జో అచ్యుతానంద జోజో ముకుందా!

లయబద్ధంగా మ్రోగింది టెలిఫోన్

ఆ ధ్వని అమృతపు సోనల్లా విశాలాక్షి చెవులకు సోకాయి. మంచంమీంచి ఒక్క ఉదుటున లేచి గబగబా ఫోన్ దగ్గరికెళ్ళింది.

"నెమ్మది నెమ్మది...... పడతావు జాగ్రత్త!" వారించాడామె భర్త.

"హలో! అబ్బాయ్ నేనురా మీ అమ్మని. కులాసాగా ఉన్నావా? రోజూ పళ్ళు తింటున్నావా? శనివారాలు ఉపవాసం ఉంటున్నావు కదా! కోడలేం చేస్తోందిరా! అక్కడ చలి ఎక్కువగా ఉందేవిట్రా..."

"అమ్మా!" విసుగ్గా అన్నాడు కొడుకు.

"నీతో మాట్లాడి పదిరోజులు పైనే అయ్యింది. అంతా బాగున్నారు కదా. అక్కడేం గొడవల్లేవు కదా. కోడలు నీళ్ళు పోసుకుందేవిట్రా...."

"ఆ సంగతి చెప్పడానికే ఫోను చేశానమ్మా. మూడో నెల"

"మా నాయనే మా తండ్రే. ఎంత చక్కని మాట చెప్పావురా. కోడల్ని జాగ్రత్తగా ఉండమను. వెంటనే డాక్టర్‌కి చూపించరా. బలమైన ఆహారం తీసుకోవాలి సుమా! అప్పుడే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారు. పుల్ల మామిడికాయలు అక్కడ దొరుకుతాయా లేక పార్శిలు ద్వారా పంపించమా?"

"అవేమీ అక్కర్లేదు గానీ, డెలివరీ టైంకి నువ్వు రావాలమ్మా. నువ్వు పోసిన ఉగ్గు పాలు తాగాను గనుకే నేనింత ఆరోగ్యంగా ఉన్నాను. నువ్వు పాడిన జోల పాటలు విన్నాను గనుకే సంగీతంతో మనస్సుని ఆహ్లాద పరచుకోవడం ఒత్తిడి తగ్గించుకోవడం అలవాటైంది"

మురిసిపోయిందామె! "మాటలు నేర్చావొరే...."

"నిజమమ్మా. మా అబ్బాయికి నువ్వే జోలపాడి చిచ్చుకొట్టి నిద్రపుచ్చాలి. మీ కోడలికి పాటలూ రావు పద్యాలూ రావూ. నువ్వు తప్పకుండా రావాలి"

"వస్తాం రా. మనవల అచ్చటా ముచ్చటా చూడటానికే కదా మాకింకా భూమ్మీద నూకలున్నాయి. నువ్వెప్పుడు రమ్మంటే అప్పుడు రెక్కలు కట్టుకుని వచ్చి వాల్తాంరా అబ్బాయ్!"

"వెంటనే పాస్‌పోర్టుకి అప్లై చెయ్యండి. నేను వీసా ఏర్పాట్లు ఏజెంటు ద్వారా చేస్తాను. ఉంటానమ్మా నాన్నని అడిగానని చెప్పు"

రిసీవర్ పెట్టేసి పరమానందంతో అంది– "ఏమండోయ్! మీరు తాత కాబోతున్నారు. కోడలికి మూడో నెలంట. మనల్ని రమ్మన్నాడు. వాడి బిడ్డకి నేను జోలపాట పాడాలంట. పిచ్చికన్న! వాడి చిన్నప్పుడు నేను పాడిన పాటలు కూడా మర్చిపోలేదు చూడండి..... వాడు నా కొడుకండీ. నా వరాల తండ్రి. వాడు పుట్టాలని ఎన్ని పూజలు చేసానో! ఎన్ని గుళ్ళు తిరిగానో! ఎందరు దేవుళ్ళకి మొక్కానో!" ఆమె కంఠం రుద్ధమైంది.

ఆ పై మాటలు మ్రింగేసి కళ్ళు తుడుచుకుంది.

"ఊరుకో విశాలా! పాతికేళ్ళనాటి సంగతులు ఇప్పుడెందుకు చెప్పు!" భుజం మీద చెయ్యేసి అనునయించారు నాగభూషణం.

"ఒకటా రెండా! నాలుగు అబార్షన్లయ్యాయి. ఇక తల్లినయ్యే యోగం లేదని ఎంత కృంగిపోయానో, ఎంత కుళ్ళిపోయానో ఆ దేవదేవుడికే తెలుసు. కడకే దేవుడు కరుణించాడో గాని వీడు పుట్టాడు. బతికి బట్టకడతాడో లేదోనని భయపడే కదా వీడికి సన్యాసయ్య అని పేరు పెట్టాను"

"అలాంటి పేరు పెట్టినందుకు వాడు మనల్ని తిట్టని రోజు లేదు! అందుకనే ఇప్పుడు ఎస్. చల్లా అని మార్చేసుకున్నాడు. ఇంటిపేరునే తన పేరు చేసుకున్నాడు!"

"ఇంటి పేరు నిలబెడుతున్నాడండీ నా బిడ్డ. అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు తిరగెయ్యండి. ఒక్కరంటే ఒక్కరు కనీసం ప్రక్క రాష్ట్రంలో అడుగుపెట్టారా? లేదు. నా కొడుకు ఏకంగా సప్త సముద్రాలు దాటి అమెరికా వెళ్ళాడు" గొప్పగా గర్వంగా చెప్పింది.

"నీ కొడుకు గ్రేట్ అని ఒప్పుకుంటున్నానుగానీ, ఇంతకీ ఏమంటున్నాడూ!"

"చెప్పాను కదండీ. మనల్ని వెంటనే పాస్‌పోర్టుకి దరఖాస్తు చేసెయ్యమన్నాడు. వీసా కాగితాలు పంపిస్తాడట. పురిటి టైంకి మనం అమెరికాలో ఉండాలట. అన్నీ దగ్గరుండి చక్కబెట్టాలట. అలా కాన్పు అవ్వగానే ఇలా పరిగెత్తుకెళ్లకూడదని కూడా చెప్పాడు. మనవడో మనవరాలో – మనవడే పుడతాళ్ళెండి. వంశం నిలబడొద్దూ! వాడికి ఉగ్గుపాలు నేనే పట్టాలంట. జో అచ్యుతానంద అంటూ పాడి నిద్ర పుచ్చాలట. అంటే కనీసం ఏడాది నిండేదాకా మన మకాం అమెరికాకి మార్చాల్సిందే. ఆవటాని తెగేసి చెప్పాడు"

"అలా అనే మనిషి కాదే!" సందేహం వెలిబుచ్చారు.

"అయినదానికీ కానిదానికీ డబ్బు లెక్కలేసుకుంటాడనండి. ఒప్పుకుంటాను. అంతేగాని మన ఖర్చు గురించి కూడా లెక్కలేసుకుంటాడంటే నేను ససేమిరా అంగీకరించను. మన కన్నబిడ్డండీ.....మన రక్తం!"

"రక్తాని కన్నా డాలర్ల బరువెక్కువే పిచ్చిదానా!"

"మీది మరీ చోద్యం! డబ్బు దగ్గర జాగ్రత్తగా ఉండటం తప్పయినట్లు మాట్లాడతారేంటీ! అసలు ఇదంతా మీ వల్లే వచ్చింది. అమెరికా ఆశ పెట్టింది మీరే. లేకపోతే బిడ్డ నా కళ్ళముందే ఉండేవాడు. వాడితో పాటే హైదరాబాదులోనో, బెంగుళూరులోనో ఉండేవాళ్ళం. కొడుకు నీడన పడుండాల్సిన వయస్సులో మారుమూల పల్లెలో బిక్కుబిక్కుమంటూ పడుండాల్సిన గతి పట్టేదా ఏమిటి!" కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"సరే......సరే ఏమన్నా అంటే కన్నీళ్ళొకటి! అమెరికా వెళ్ళమన్నాను గాని, ఏకంగా అక్కడే తిష్ఠవేసుక్కూర్చోమన్నానా? ఫోన్ భాగ్యానికి లెక్కలేసుకుని నెలకోసారి మాత్రమే ఫోన్ చెయ్యమన్నానా?"

"చాల్లెండి. మీదెప్పుడు కార్యక్రమం ఎప్పుడూ ఉండేదే కదా! మంచిరోజు చూసుకుని పాస్‌పోర్టుకి అప్లై చేద్దాం. మరీ నెలలు నిండేదాకా ఆగకుండా కాస్త ముందుగానే వెళదాం. తొలిచూలు కదా కోడలికేం తెలుస్తుందీ. దగ్గరుండి అన్నీ మనమే చక్కబెట్టాలి"

"అలాగలాగే. నీ కొడుకెప్పుడు రమ్మంటే అప్పుడు విమానం ఎక్కేద్దాం. సరేనా! ఇంక పడుకోనియ్యి" ఆవులించారు నాగభూషణం.

పడుకుని దుప్పటి కప్పుకుంటూ అంది- "అమెరికా ఎలా ఉంటుందండీ. స్వర్గంలా ఉంటుందంటారంతా. నిజమేనంటారా? అమెరికా చూసే భాగ్యం నా కళ్ళకి ఉందనుకోలేదు"

"కొడుకు చూపించడని ముందే డిసైడ్ అయిపోయావన్నమాట!"

"మీరు మాత్రం తక్కువ తిన్నారా? విమానం ఎక్కాలీ, మేఘాల్లో తేలిపోవాలీ, విమానంలోంచి చంద్రుడ్ని చూడాలీ అని ఎంతగా ఊరిపోలేదు చెప్పండి?!"

"అవన్నీ అబ్బాయి అమెరికా వెళ్ళిన కొత్తలోని ఊసులు. ఆ తర్వాత వాడు డబ్బు మనిషని తెలిశాక ఆశలన్నిటినీ తుంచేసుకున్నాను"

"నేనొప్పుకోను. సమయం సందర్భం కలిసిరాక రమ్మన్లేదు గాని, ఇప్పుడు రమ్మన్నాడా లేదా?"

"రమ్మన్నాళ్ళే గాని ఇంక పడుకో. అమెరికా ప్రయాణం గురించి మట్లాడుకోడానికి ఇంకా చాలా టైముందిలే!"

"విమానం ఎక్కి దేశం కాని దేశం వెళ్తామంటే ఎంత ఆనందంగా ఉందో చెప్పలేనండి. మన బంధువుల్లో ఎవరూ అటు కాశీ, ఇటు మద్రాసు దాటి వెళ్ళలేదండీ!"

"అవును. మన బంధుమిత్రుల్లో అమెరికా వెళ్తున్న మొట్టమొదటి తల్లివి నువ్వే. అలా అని బంగారు అక్షరాలతో ఫలకం చేయించి పెట్టమంటావా ఏమిటి?" హాస్యమాడారు.

"మీరు మరీనూ!" అందంగా సిగ్గుపడింది విశాలాక్షి.

"ఎక్కడో పిచ్చిది!" అనుకున్నారు నాగభూషణం.

* * *

నాగభూషణం దంపతులు హైదరాబాద్ వెళ్ళి బంధువులింట్లో దిగారు. పాస్‌పోర్టు ఆఫీసులో దరఖాస్తు చేశాక బంధువుల ఇళ్ళన్నీ చుట్టేశారు.

"ఎలాగూ ఇంతదూర వచ్చామాయె, అందర్నీ పలకరించకపోతే బావుండదు సుమండీ!" అని పైకి చెప్పింది విశాలాక్షి.

కాని తాము అమెరికా వెళ్తున్న సంగతి చాటింపు వెయ్యడానికేనన్న సంగతి ఆమెకి తెలుసు. ఆమెకి తెలుసని నాగభూషణానికీ తెలుసు. అయినా ఆమె ఆనంద పానకంలో పుడకలా మారడానికి ఇష్టపడక తెలియనట్టుగా ఉండిపోయారు.

"అమెరికాలో చలి ఎక్కువవంట! రజాయిలూ, స్వెట్టర్లూ కొనేద్దామండీ"

""వెళ్ళేముందు కొనొచ్చులేవే"

"అప్పుడంతా తొడ తొక్కిడైపోతుంది గానీ కొనేద్దామండీ!"

కాదనలేకపోయారు. ప్రయాణానికి ఏమేమి అవసరమనుకున్నారో అవన్నీ కొనేసింది విశాలాక్షి. పుట్టబోయే మనవడికీ చాలా చాలా కొన్నది!

* * *

ఇద్దరికీ పాస్‌పోర్టులొచ్చాయి. విమాన టిక్కెట్లు చేతికొచ్చినంతగా సంబరపడ్డారు.

వెంటనే కొడుక్కి ఫోన్ చేయించింది విశాలాక్షి.

"వీసా కూడా వచ్చేస్తుందిలే. ఇవాళ రేపట్లో ఏజెంటొచ్చి కలుస్తాడు. సంతకాలవీ పెట్టు. ఒకరోజున హైదరాబాద్ కాన్సులేట్ ఆఫీసుకెళ్ళాల్సొస్తుంది. వాళ్ళు చాలా

అడుగుతారు. నిన్ను తెలుగులోనే అడుగుతార్లే. ఏం చెప్పాల్సిందీ అతడు వివరిస్తాడు. అతడు చెప్పినట్లు వినండి చాలు"

"వింటాం లేరా. కోడలికెలా ఉంది? వేవిళ్ళ బాధ లేదు కదా! ఎప్పుడొచ్చి మీ ఇద్దర్నీ చూస్తామా అని ఆరాటంగా ఉందనుకో. రెక్కలుంటే ఇప్పటికిప్పుడు బయల్దేరి వచ్చేద్దుం అనుకో...."

"టైమ్‌కొస్తే చాల్లేమ్మా. నాన్న ఏమంటున్నారూ?"

"ఎప్పుడూ పాడే పాటే. నువ్వు ప్రతిదానికీ డబ్బు లెక్కలేస్తుంటావని దెప్పుతుంటారు"

"లెక్క లేసుకోకుండా లెక్క లేనట్టుంటే ఇక్కడ సుఖంగా బ్రతకలేం"

"ఎంత చెట్టుకి అంతగాలి అన్నారందుకే. రెండు మూడు రకాల పచ్చళ్ళూ, కారప్పొడీ, పూత రేకులూ, చక్కిడాయిలూ తెద్దామనుకుంటున్నాను. ఇంకేమైనా కావాలేమో కోడల్ని అడిగి చెప్పరా!"

"అలాగేనమ్మా. నువ్వెప్పుడొస్తావా అని ఎదురు చూస్తోంది"

"మా అమ్మే మా తల్లే. నేనంటే కోడలికెంత ఇదిరా. తొందరగానే వచ్చేస్తాం!. ధైర్యంగా ఉండమని నా మాటగా చెప్పు. కాలు కదపకుండా కూర్చోబెట్టి ఇష్టమైనవన్నీ చేసి పెడతానని తప్పకుండా చెప్పరా అబ్బాయ్!"

"అలాగే. ఇక ఉంటాను. నాన్నని అడిగానని చెప్పు"

ఫోన్ పెట్టేసి- "ఇది విన్నారా....." అంది సంతోషంగా విశాలాక్షి.

"ఆ ఇదేమిటో చెప్పు వింటాను"

"కోడలు నేనెప్పుడొస్తానా అని ఎదురు చూస్తోందిటండీ. ఏమాటకామాటే చెప్పుకోవాలి. కోడలికి నేనంటే ఎంతో ఆపేక్షండీ. అందుకనే కన్న తల్లిని కాదని నన్ను పురుడు పోయడానికి రమ్మంటోంది"

"పాయింటే సుమా...."

"మీకు అన్నీ హాస్యాలే. చూస్తూండండి...అబ్బాయీ, కోడలూ నన్ను నెత్తిమీద పెట్టుకుని ఊరేగిస్తారు"

సానుభూతిగా చూసారు నాగభూషణం.

* * *

ట్రావెలింగ్ కన్సల్టెన్సీ తాలూకు ఏజెంటు నాగభూషణం ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు.

"మీదింత కుగ్రామమని ముందే తెలిస్తే ఇంత దూరం వచ్చేవాడ్నే కాదు" అన్నాడు బట్టకంటిన దుమ్ము దులుపుకుంటూ.

"మట్టి రోడ్డుని చూసి ముఖం చిట్లిస్తే ఎలాగయ్యా! ఈ మట్టి మనుషుల ప్రేమాభిమానాల ముందు ఏవీ నిలవలేవు" అన్నారు నాగభూషణం.

అర్థం కానట్టు మొహం పెట్టాడతడు. కాఫీ కలిపి తెచ్చిచ్చింది విశాలాక్షి. సగం తాగి క్రింద పెట్టేసాడు. బ్రీఫ్‌కేస్‌లోంచి కొన్ని పేపర్లు బయటికి తీసి ఆవిడచేత సంతకాలు పెట్టించుకున్నాడు.

అదయ్యాక బ్రీఫ్‌కేస్ సర్దుకుంటుంటే- "ఈయన సంతకాలు తీసుకోలేదేం?" అనడిగింది విశాలాక్షి.

"అమెరికా వెళ్ళేవారికే వీసా కావాలి గాని వారికెందుకూ?"

అదిరిపడ్డారు నాగభూషణం, విశాలాక్షి.

"ఆయన వెళ్ళటం లేదని ఎవరు చెప్పారు? ఇద్దరం కలిసే వెళ్తున్నాం!" అతి కష్టం మీద గొంతు పెగల్చుకుని మొండిగా అందామె.

"చల్లాగారి ఈ-మెయిల్ క్లియర్‌గా ఉంది. మీ ఒక్కరికే అప్లై చెయ్యమన్నారు, చేస్తున్నాను"

కన్నీళ్ళు ఉబికి వచ్చేసాయి. "ఆయన లేకుండా గడపదాటి ఎరగను. వెళ్తే ఇద్దరం వెళ్తాం, లేకపోతే లేదు"

"చల్లాగారితో మాట్లాడండి. ఆయన చెయ్యమంటే చేస్తాను. కస్టమర్ చెప్పిందే మాకు వేదం"

పరాయివాళ్ళముందు పలచనవ్వటం ఇష్టం లేక- "అబ్బాయి ఉద్దేశమేంటో కనుక్కుందాంలే!" అంటూ అతణ్ణి సాగనంపారు.

ఆ సాయంత్రమే కొడుక్కి ఫోన్ చేసారు.

"నా ఒక్కదానికే వీసా ఏర్పాట్లు చెయ్యమన్నావుట కదా! మీ నాన్న లేకుండా ఎలా వస్తాన్రా. నేను లేకుండా ఆయనెలా ఉండగలరు!"

"జస్ట్ త్రీ ఫోర్ మంత్సమ్మా.. నాన్న ఎలాగో ఎడ్జస్టవుతార్లే"

"ఆయన్నొదిలి రాలేన్రా అబ్బాయ్..... వస్తే గిస్తే ఇద్దరం కలిసే వస్తాం"

"అయ్యో నీకెలా చెప్పాలమ్మా. టెర్రరిస్టు గొడవల వల్ల వీసాల జారీ బాగా తగ్గించేశారు. అందుకనే మొదట నీకు ప్రయత్నిస్తున్నాం. వీలుపడితే నాన్న తర్వాత వస్తార్లే"

"నాకు కుదర్దుగాని మీ అత్తగార్ని పిలుపించుకోరా!" అంటూ విసురుగా రిసీవర్ పెట్టెయ్యబోతోంటే మధ్యలో దాన్నందుకుని, "నువ్వేం ఇదవ్వకురా. మీ అమ్మ వస్తుంది" అని చెప్పి ఫోన్ పెట్టేసారు నాగభూషణం.

"మీరిక్కడెలా ఉంటారు. మీ ఆలనా పాలనా ఎవరు చూస్తారు?" రోదనా స్వరంతో ప్రశ్నించింది.

"నేనెలాగో నెట్టుకొస్తాన్లే. నాకన్నా నీ అవసరం కోడలికీ, పుట్టబోయే బిడ్డకీ ఎక్కువగా ఉంది. ఇంకేం మాట్లాడకు. అబ్బాయిని బాధ పెట్టొద్దు!"

మరి మట్లాడలేకపోయిందామె.

* * *

విశాలాక్షి అమెరికా ప్రయాణం వారంలో కొచ్చింది. రోజురోజుకీ అమెరికా వెళ్తున్నానన్న సంతోషం సన్నగిల్లుతూ, భర్తని వదిలి ఒంటరిగా వెళ్తున్నానే అన్న దిగులు పెరగసాగింది.

"నేను వెళ్ళలేనండి. మిమ్మల్ని విడిచి అన్ని రోజులుండలేను. మీరు లేని స్వర్గం నాకు వద్దు"

"నువ్వు వెళ్తున్నావు అంతే! రేపు భీమవరం వెళ్ళి రామారాజుగార్ని కలిసొద్దాం. అమెరికా నుంచి ఇవాళొచ్చి ఉంటారు. నిన్ను ఆయనతో బాటు పంపమన్నాడు కదా అబ్బాయి. ముందే పరిచయం చేసుకుంటే మంచిది. అక్కడ వేటి వేటికి అవసరముంటుందో కనుక్కుంటే అవన్నీ తీసుకెళ్ళొచ్చు"

మర్నాడే భీమవరం వెళ్ళారు.

"ఇవాళ సెప్టెంబరు పదకొండే. మహా విధ్వంసం జరిగిన రోజు. కొన్నేళ్ళ క్రితం ఇదే రోజున న్యూయార్క్‌లోని రెండు మహా భవనాలని విమానాలతో గుద్దించి కూల్చేసారు టెర్రరిస్టులు. అలాంటి రోజున వెళ్తున్నామేంటో!" దారిలో అన్నారు నాగభూషణం.

కించిత్తు బాధ, భయం ధ్వనించాయి ఆయన స్వరంలో.

"అబ్బాయి చెప్పాడు. ఆ గొడవల వల్లే వీసాలు రావటం కష్టమవుతోందిట. నిఘా ఎక్కువయ్యిందిట. లేకపోతే మిమ్మల్నీ తీసుకెళ్ళేవాడే!" అందామె.

రామరాజు ఎవరో కనుక్కుని ఆయన దగ్గరికెళ్ళి పలకరించారు.

"ఈవిడ్నేనా నేను తీసుకెళ్ళాల్సింది?" అడిగారాయన విస్మయంగా చూస్తూ.

కొంచెం ఎడంగా నిలబడి ఉన్న విశాలాక్షి చేతులు జోడించింది.

"ఇంతకంటే మంచి ఆయా దొరకలేదా? ముసిల్ది, మరీ పల్లెటూరి మనిషిలా ఉంది"

చలిపిడుగు మీద పడ్డట్టు అదిరిపడ్డారు నాగభూషణం దంపతులు.

"ఏవిటీ....ఆయాని ఇక్కడ్నుంచి పంపిస్తున్నారా? అక్కడ దొరకరూ?" ప్రక్కనే ఉన్న రాజుగారి బంధువు ఆశ్చర్యపోతూ అడిగాడు.

"దొరుకుతారు. గంటకి యాభై, అరవై డాలర్లు చార్జి చేస్తారు. దానికన్నా ఇక్కడ్నుంచి పేరంటునో, మరొకర్నో తీసుకెళ్ళడం ఎంతో చవక!"

విశాలాక్షి ముఖంలోని రక్తమంతా అమాంతం ఇంకిపోగా నిలబడే శక్తిలేనట్టు కూర్చుండిపోయింది.

నాగభూషణం పరిస్థితీ అలాగే వుంది. అతి కష్టం మీద నోరు పెగల్చుకున్నారు- "ఆయాని తీసుకురమ్మని మా అబ్బాయి చెప్పడాండీ?"

"తను చెబితేనేగా నాకు తెలిసింది. ఏం ఎందుకలా అడుగుతున్నారు?

"చాలా సంతోషమండీ. వస్తామండి. రా విశాలా...."

"అరెరె....వాట్ హేపెన్డ్?"

"ఈ ఆయా అమెరికా రాదు" అనేసి వడివడిగా అడుగులేసిందామె.

ఇంటికెలా తిరిగొచ్చారో వారికే తెలీదు. తుఫానుల్లో సర్వం కోల్పోయిన వాళ్ళలా ఉన్నారు.

"నువ్వెళ్ళకపోతే అబ్బాయి బాధపడతాడు విశాలా!" మెల్లగా అన్నారు.

"పడనీండి. వాడ్ని మోయడానికీ, కనడానికీ నేను బాధపళ్ళేదూ?!"

"అది కాదు. విశాలా...."

"ఇది వరకు మీ మాట విన్నాను. ఇప్పుడు వినను. యశోదలో ఆయాని గాక అమ్మని చూసాడండీ బాల కృష్ణుడు. అందుకనే ఆమె కన్నతల్లి కన్నా మిన్నయై 'జో అచ్యుతానంద జో జో ముకుందా' అని పాడగలిగింది. కాని నా ముద్దుల కొడుకు అమ్మలో ఆయాని చూసాడు. రక్తమాంసాలు పంచి ఇచ్చిన తల్లిని తల్లి అని చెప్పుకోడానికి సిగ్గుపడ్డాడు. ఆ నిజం తెలిసి నా గొంతు మూగబోయిందండీ. ఇంక జోల పాటెలా పాడగలను?" బావురుమందామె.

ఇంతలో ఫోను మ్రోగింది.

"ఏంటి నాన్నా! రాజుని కలిసేదో సీన్ క్రియేట్ చేసారంటేంటి? నా పరువు తీస్తారా? మీరసలు నా పేరెంట్సేనా?" దూకుడుగా అన్నాడు సన్యాసయ్య.

"నీ కొడుక్కి జోలపాట పాడటానికి రమ్మన్నావు. కాని తనిప్పుడు తన కొడుకుతో సైతం మాట్లాడలేనంత మూగదయిందిరా!"

"అలా మాట్లాడతారేంటి! ఇప్పుడేమంత కొంప మునిగిందనీ?"

"లాడెన్ అనే ఉన్మాది వల్ల న్యూయార్క్‌లో సగర్వంగా తలెత్తుకున్న పదకొండు అంకెలాంటి జంట భవనాలు నేలకూలాయి. ఎప్పుడో గుర్తుంది కదా! సరిగ్గా అదే తారీఖున అమెరికాలో ఉంటోన్న సన్నాసి వల్ల ఇండియాలోని వృద్ధజంట నిలువునా కూలిపోయార్రా. ఇక మిగిలినవి శిథిలాలే! శకలాలే!"

**(చిత్ర సకుటుంబ సచిత్ర మాసపత్రిక డిసెంబరు 2010)**